

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు
5
శనివారం 14 డిసెంబరు 2024

ప్రకృతి దోబూచులాటతో వరి రైతు ఇబ్బంది పడుతున్నాడు. పంట చేతికి వస్తున్న తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనాలు, వాయుగుండాలు రైతులకు గండంగా మారుతున్నాయి. వరి కోతల సమయంలో ఆకాశం మేఘావృతంగా ఉండడం, వర్షాలు సైతం కురుస్తుండడంతో రైతులు లబోదిబోమంటూ ఉరుకులు పరుగులు పెడుతున్నారు. గత నెలలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో దాదాపు వారం రోజుల పాటు వరికోతలు ఆగిపోయాయి. ఐదారు రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు వరికోతలు మొదలు పెట్టారు. ఇంతలోనే నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి బుధవారం సాయంత్రం నుంచి ముసురు వాతావరణంతో పాటు వర్షాలు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


చింతకొమ్మదిన్నె మండలం బోడెద్దులపల్లెలో ఆరబోసిన వడ్లను కుప్పగా వేస్తున్న రైతు

అన్నదాతకు వాయుగండం




వర్షానికి తడవకుండా వడ్ల కుప్పను టార్పాలిన్లతో కప్పుతున్న రైతులు

- అల్పపీడన ప్రభావంతో వర్షాలు
- ఉరుకులు పరుగులు పెడుతున్న రైతులు
- వరికోతలు వాయిదా వేసుకోవాలని అధికారుల సూచన
- కోత కోసిన పొలాల్లో ఆదరాబాదరాగా కుప్పలు

కడప రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో కేసీ కెనాల్ ఆయకట్టుతో పాటు, బోరుబావులు, నదీ పరివాహక ప్రాంతాలు, ఇతర నీటి వనరుల కింద జిల్లాలో 75 వేల ఎకరాల వరకు వరి సాగుచేశారు. బోరుబావుల కింద సాగైన వరి పంటకు సంబంధించి నవంబరు నెలాఖరు నుంచి కోతలు ప్రారంభమయ్యాయి. కేసీ కెనాల్ ఆయకట్టు కింద కాస్త ఆలస్యంగా సాగైన వరి పంట కోతలు డిసెంబరు రెండోవారంలో మొదలై జనవరి వరకు కొనసాగనున్నాయి. ఇప్పటికి దాదాపు 35వేల ఎకరాల వరకు వరికోతలు జరిగాయి. ఇంకా 35వేల ఎకరాలలో వరికోతలు జరగాల్సి ఉంది. కోతలు పూర్తయిన చోట ధాన్యాన్ని రైతులు రహదారులపైన, పంట కల్లాల్లోను ఆరబోశారు. మరి కొంత కుప్పలపై ఉంది. వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టినప్పటికి ఈ వ్యవహారం నత్తనడకన సాగుతుండడంతో రైతులు తీవ్ర ఇక్కట్లకు లోనవుతున్నారు. మూడు రోజుల నుంచి ఆకాశం మేఘావృతంగా ఉండడంతో పాటు వర్షాలు కురుస్తుండడంతో వరి పనలు తడిసిపోయి ధాన్యం పాడైపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

రబీపంటలపై ముసురు ముప్పు

బంగాళాఖాతంలో ఏర్పడిన అప్పపీడన ప్రభావంతో ముసురు వాతావవరణం కమ్ముకోవడంతో రబీ పంటలకు ముప్పు పొంచి ఉంది. మూడు రోజులుగా వాతావరణం చల్లబడి వర్షాలు పడుతుండడంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. ఇటీవల ఫెంగల్ తుఫాను ప్రభావంతో వారం రోజుల పాటు ముసురు వర్షాలు పడడంతో తేమశాతం అధికమై పంటలను చీడపీడలు ఆశించాయి. ఇలాంటి తరుణంలో ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా మళ్లీ ముసురు వర్షాలు అలుముకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ కింద అక్టోబర్ నెలలో మినుము పంటను 12,640 హెక్టార్లలో సాగుచేశారు. అలాగే దాదాపు 1,500 హెక్టార్ల వరకు బుడ్డశనగ పంటను సాగుచేశారు. ముసురు వర్షాలకు మినుము, బుడ్డశనగ పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు.

వరికోతలు వాయిదా వేయాలి

అల్పపీడనం ప్రభావంతో రానున్న రెండు, మూడు రోజుల పాటు వర్షాలు పడనున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలను వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే కోత కోసిన వరి పనలను ఎత్తు ప్రదేశాల్లో కుప్పలుగా వేసుకుని తడవకుండా టార్పాలిన్లు కప్పాలని సూచించారు.


కల్లం వద్దనే పచ్చి వడ్లను లారీల్లోకి ఎక్కిస్తున్న కూలీలు

వర్షానికి భయపడి వడ్లను కుప్పగా చేస్తున్న రైతులు




ధర లేని ధాన్యం.. రైతు దైన్యం

దువ్వూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు జడివానలు పట్టుకుని వరికోతలకు ఇబ్బంది పడుతుంటే.. మరోవైపు ఒడిపిన ధాన్యానికి ధరలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి కోతలు కోసిన రైతులు ధరలేకున్నా ఆర్థిక ఇబ్బందులతో పొలాల్లోనే వడ్లను విక్రయిస్తున్నారు. బస్తా రూ.1300 నుంచి రూ.1400 మాత్రమే పలుకుతోంది. కిందటి సంవత్సరం ఇదే సీజన్‌లో 77 కిలోల బస్తా వరి ధాన్యం రకాన్ని బట్టి రూ.1800 నుంచి రూ.2,100 పలికింది.

సాగు పెట్టుబడులు రెట్టింపు

నాలుగేళ్ల కిందటికి, ఇప్పటికి పోలిస్తే వరిసాగులో పెట్టుబడులు రెట్టింపు అయ్యాయి. యూరియా, పాస్ఫేట్ వంటి రసాయనిక ఎరువుల ధరలు బాగా పెరిగాయి. ఎకరాకు ఎంత లేదన్నా 30 నుంచి రూ.35 వేలు పెట్టుబడులు అవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా కేసీ ఆయకట్టు పరిధిలో వరి సాగవుతోంది. అలాగే కుందూ, తెలుగుగంగ, పెన్నా పరీవాహక ప్రాంతాలు, బోర్ల కింద సైతం వరి సాగులో ఉంది. ఈ సారి ప్రతి చోట వరి పంట ఆశాజనకంగా కనపడుతోంది. ప్రస్తుతం దిగుబడులకు ఢోకా లేదు. ధర విషయంలోనే రైతులు డీలాపడుతున్నారు. కొందరు రైతులు పంట కోతలు కోసి ధాన్యం ఆరబెడుతున్నారు. మరికొందరు ఆకాశం ముసురుకుని ఉండడంతో బెంబేలెత్తుతున్నారు. దీంతో కోతలు కోసిన వారు అయినకాడికి అమ్మేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలతో పోలిస్తే పెట్టిన పెట్టుబడులు మాత్రమే వచ్చేలా ఉందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరతో తమ వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.


నేలటూరులో ధాన్యం వద్ద దిగాలుగా కూర్చున్న రైతు

బ్రహ్మంగారిమఠంలో మరో వివాదం

- బ్రహ్మంగారి వంశస్థుల సమాధుల తొలగింపు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన మారుతి మహాలక్షుమ్మ

బ్రహ్మంగారిమఠం/కడప కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞానకర్త పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో అధికారుల చర్యలతో మరో వివాదం నెలకొంది. కరోనా సమయంలో వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం 11వ పీఠాధిపతి వీరభోగ వసంత వేంకటేశ్వర స్వామి శివైక్యం చెందారు. అప్పటి నుంచి తదుపరి మఠాధిపతులుగా ఎవరు అనేదానిపై వివాదాలు, కోర్టు వ్యవహారాలు కొనసాగుతూనే వస్తున్నాయి. ఇటీవల బ్రహ్మంగారిమఠం ఆలయ ప్రాంగణంలో స్వామివారి వంశస్థుల సమాధులను తొలగించడం మరో వివాదానికి కారణమైంది. ఆలయ ప్రాంగణంలో వీరబ్రహ్మేంద్ర స్వామి వంశస్థుల సమాధులను ఏర్పాటు చేస్తూ వచ్చేవారు. అలా ఏర్పాటు చేసిన కొన్ని సమాధులను ఇటీవల అభివృద్ధి పేరుతో బ్రహ్మంగారి మఠం దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తొలగించారు. మూడు నెలల క్రితం బ్రహ్మంగారిమఠం దేవస్థానంలోని పురాతన కార్యాలయం గదికి కుడివైపున ఉన్న కొన్ని సమాధులను ఎవరికీ తెలపకుండానే అభివృద్ధి పేరుతో తొలగించారు. దీనిపై దివంగత మఠాధిపతి వీరభోగ వసంత వేంకటేశ్వర స్వామి పత్ని మారుతి మహాలక్షుమ్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే గతంలో బ్రహ్మంగారిమఠం దేవస్థానానికి శిష్యులుగా, భక్తులుగా ఉండిన మునగాచలమయ్య శ్రేష్ఠి 1960లో, మునగా వెంకటరత్నమయ్య 2000లో మృతిచెందారు. వీరి సమాధులను ఆలయం ముందు భాగాన మాడవీధులలో వ్యాపార సముదాయాలు ఉన్న సత్రాల గదులలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అభివృద్ధి పేరుతో వారి సమాధులను కూడా తొలగించడంతో ఆర్యవైశ్య సంఘం నేతలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. దేవస్థానం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా తమ పూర్వీకుల సమాధులను తొలగించడంపై మారుతి మహాలక్షుమ్మ శుక్రవారం ఎస్పీ, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేశారు. అలాగే బ్రహ్మంగారిమఠం దేవస్థానం ప్రాముఖ్యతను కాపాడేందుకు దేవదాయశాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు.


కడపలో పాత్రికేయులతో మాట్లాడుతున్న మారుతి మహాలక్షుమ్మ

ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలి

బ్రహ్మంగారిమఠంలో వీరబ్రహ్మేంద్ర స్వామివారి వారసుల సమాధులను రాత్రికి రాత్రి సంబంధిత దేవదాయశాఖ ఉద్యోగి శంకరబాలాజీ తొలగించడం బాధాకరమని దివంగత మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి ధర్మపత్ని మారుతీ మహాలక్షుమ్మ పేర్కొన్నారు. తక్షణమే ఆయనపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం ఆమె కడప ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. స్వామి వారసుల సమాధులను తొలగించే అధికారం ఆ ఉద్యోగికి లేదన్నారు. సామాన్య వ్యక్తుల సమాధులు తొలగించాలంటేనే కుటుంబ సభ్యుల అనుమతి తీసుకోవాలన్నారు. అలాంటిది వందల సంవత్సరాల చరిత్ర కలిగిన మఠంలో అర్ధరాత్రి వేరెవ్వరికీ సమాచారం ఇవ్వకుండా అధికారి అనుచరులతో సమాధులను తొలగించడం దారుణమన్నారు. ప్రభుత్వ ఆదేశాలను పెడచెవిన పెట్టి సుమారు రూ.10 కోట్లకు పైగా మఠం నిధుల దుర్వినియోగానికి కారకులైన ఆ అధికారి తీరుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తన వద్ద ఉన్న మఠానికి చెందిన కారును కూడా ఆ అధికారి హస్తగతం చేసుకుని స్వంత అవసరాలకు వాడుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్పందించి ఆ ఉద్యోగి అవినీతిపై ఏసీబీ అధికారులతో విచారణ చేయించాలని కోరారు. ఈ సమావేశంలో వీరబ్రహ్మేంద్రస్వామి ప్రచారపరిషత్ ప్రతినిధి పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధ్వానంగా రైతుల పరిస్థితి

- ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలి : వైసీపీ

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని వైసీపీ నేతలు ఆరోపించారు. తక్షణం పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం 'అన్నదాతకు అండగా వైసీపీ' అనే కార్యక్రమంలో భాగంగా రైతులు, కార్యకర్తలతో కలిసి కడపలో వైసీపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. వైసీపీ జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాల్సిందేనని అన్నారు. దళారీ వ్యవస్థను తొలగించాలన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలన్నారు. నీటి సంఘాల ఎన్నికల్లో బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అడ్డుకున్న ఎంపీని నిర్బంధించడం సరికాదన్నారు. పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, నగర మేయర్ సురేశ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీలు గోవిందరెడ్డి, రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, మాజీ చైర్మన్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న వైసీపీ శ్రేణులు

కొనసాగుతున్న రాఘవరెడ్డి విచారణ

కడప క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి విచారణ కొనసాగుతోంది. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రరెడ్డి ఇప్పటికే అరెస్టయ్యి జైలులో ఉన్నారు. ఇదే కేసులో బండి రాఘవరెడ్డిని నాలుగు రోజుల నుంచి కడప సైబర్ కార్యాలయంలో పోలీసులు విచారిస్తున్నారు. శుక్రవారం ఉదయ 10గంటలకు కడప సైబర్‌సెల్ కార్యాలయానికి న్యాయవాది, అనుచరులతో కలిసి రాఘవరెడ్డి హాజరయ్యారు. ఉదయం కొద్దిసేపు పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ విచారించారు. అనంతరం వేములలో జర్నలిస్టులపై దాడి జరగడంతో ఆయన అక్కడకు వెళ్లి తిరిగి సాయంత్రం వచ్చారు. అనంతరం రాఘవరెడ్డిని రాత్రి 9 గంట ల వరకు విచారణ చేశారు. ఈ విషయంపై పులివెందుల డీఎస్పీ మీడి యాతో మాట్లాడుతూ రాఘవరెడ్డి విచారణ సాగుతోందని అయితే తాము అడుగుతున్న ప్రశ్నలకు సబంధించి ఆయన సరైన సమాధానాలు చెప్పడం లేదన్నారు. ఫేస్‌బుక్ పాస్‌వర్డ్ తెలియదని, సెల్‌ఫోన్ పడిపోయిందని చెబుతున్నాడన్నారు. ప్రశ్నలకు సమాధానం చెప్పే వరకు విచారణ సాగు తుందన్నారు. కాగా.. శుక్రవారం రాత్రి విచారణ అనంతరం మీడియా ఎదుట బండి రాఘవరెడ్డి మాట్లాడుతూ.. పోలీసులు అడిగే ప్రతి ప్రశ్నకు తనకు తెలిసిన విషయాలన్నీ చెబుతున్నానని అన్నారు. ఈనెల 17న హాజరుకావాలని నోటీసులు ఇచ్చారన్నారు. ఆ రోజున విచారణకు హాజరవుతానని అన్నారు.


పోలీసు విచారణకు వస్తున్న రాఘవరెడ్డి

తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఉద్రిక్తత

- నీటి పన్ను చెల్లించేందుకు వైసీపీ వారిని అనుమతించని టీడీపీ
- కార్యాలయాల వద్ద పోలీసుల బందోబస్తు
- పెద్దముడియం వీఆర్వోల కిడ్నాప్..?


జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఆవరణలో గుమికూడిన రైతులు, వైసీపీ నాయకులు

పులివెందుల/జమ్మలమడుగు/పెద్దముడియం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పులివెందుల, జమ్మలమడుగు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితులు ముందుగానే ఊహించిన పోలీసు శాఖ పెద్ద ఎత్తున బలగాలను మోహరించింది. శనివారం సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలంటే అభ్యర్థులు నీటితీరువా చెల్లించి నోడ్యూస్ సర్టిఫికేట్ పొందాల్సి ఉంటుంది. ఈ తతంగం శుక్రవారం సాయంత్రంలోపు పూర్తి కావాలి. కానీ గురువారం తొండూరు, వేముల, వేంపల్లె తహశీల్దార్ కార్యాలయాల ఎదుట వైసీపీ వారిని టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు శుక్రవారం ఉదయం నుంచే పులివెందుల నియోజకవర్గంలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల ఎదుట భద్రత కట్టుదిట్టం చేశారు. అయినప్పటికి వేముల మండలంలో చిన్నపాటి గొడవ చోటుచేసుకుంది. ఓ టీవీ ప్రతినిధి, కెమెరామేన్, ఓ పత్రిక విలేకరిపై టీడీపీ దాడి చేశారు. వెంటనే ఎంపీ అవినాశ్‌రెడ్డి వేముల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఎంపీని పోలీసులు అదుపులోకి తీసుకొని పులివెందులలోని వైసీపీ కార్యాలయానికి తరలించి హౌస్ అరెస్టు చేశారు. వేంపల్లె మండలంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి సతీశ్‌కుమార్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. దీంతో అన్ని మండలాల్లో వైసీపీకి చెందిన వారు నీటితీరువా చెల్లించేందుకు తహశీల్దార్ కార్యాలయాలకు రాకుండా ఆగిపోయారు. పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆయన అనుచరులతో కలసి సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అన్ని మండలాల్లో పర్యటించారు. కాగా.. వేములలో మీడియా వారిపై దాడిని ఏపీయూడబ్ల్యూజే నేతలు ఖండించారు. ఈ మేరకు కడపలో ఏఎస్పీ ప్రకాశ్‌బాబును కలసి వినతిపత్రం ఇచ్చారు.

డీఎస్పీని కలిసిన ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగులో శనివారం జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చూడాలని డీఎస్పీ వెంకటేశ్వరరావుకు వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. ముందుగా ఆయన రైతులతో కలిసి జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ డిప్యూటీ తహశీల్దార్లకు వినతి పత్రం అందజేసిన అనంతరం ఎమ్మెల్సీ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిపించాలని గురువారం సాయంత్రం ఆర్డీవో సాయిశ్రీతో పాటు డీఎస్పీకి విజ్ఞప్తి చేశానన్నారు. నో డ్యూస్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరినా వీఆర్వోలు, తహశీల్దార్లు రైతులకు పలకడం లేదన్నారు. తహశీల్దార్‌లు స్థానికంగా లేకుండా వెళ్లారని, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకున్నారని అన్నారు. పెద్దముడియం వీఆర్వోలను కూటమి నేతలు కిడ్నాప్ చేశారన్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో గొడవలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

అనంతరం అక్కడి నుంచి డీఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. అప్పటికే అక్కడ పెద్దముడియం రైతులు ఉన్నారు. పెద్దముడియం తహశీల్దారు కార్యాలయం నుంచి వీఆర్వోలను కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని డీఎస్పీ వెంకటేశ్వరరావుకు రైతులు తెలిపారు. కిడ్నాప్ చేసిన వారి పేర్లను సైతం వారు డీఎస్పీకి వివరించారు. ఇప్పటికైనా సాగునీటి సంఘాలకు ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు అధికారులంతా కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్సీ కోరారు.


పులివెందుల తహశీల్దార్ కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు



బ్రౌన్ శాస్త్రి జానమద్ది

- తెలుగువారి గుండెల్లో శాశ్వత స్థానం
- నేడు జానమద్ది శతజయంతి స్మారకోపన్యాసం
- హాజరుకానున్న జస్టిస్ ఎన్వీ రమణ

వివరాలు... 6లో..

ఆధ్యాత్మిక, ఆరోగ్య, పర్యావరణ పర్యాటకంతో అపార అవకాశాలు



సెమినార్ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మిల్టన్

పీలేరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జీవ, భౌగోళిక వైవిధ్యం ఎక్కువగా ఉన్న మన దేశంలో ఆధ్యాత్మిక, ఆరోగ్య, పర్యావరణ రంగాలతో పర్యాటక రంగాన్ని అనుసంధానం చేస్తే యువతకు అపార ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెన్నైలోని సవిత విశ్వ విద్యాలయ ఆచార్యులు డాక్టర్ మిల్టన్ అన్నారు. 'పర్యావరణ పర్యాటకం-సుస్థిరాభివృద్ధి' అంశంపై శుక్రవారం స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జాతీయ సెమినార్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్లోబలైజేషన్ కారణంగా దేశంలో సాహస క్రీడలు చేసే వారు, ప్రకృతి ప్రేమికులు, పర్యటనలపై ఔత్సాహికుల సంఖ్య పెరిగిందన్నారు. పర్యావరణ పర్యాటకంతో కేవలం ఆర్థికాభివృద్ధి మాత్రమే కాకుండా పర్యావరణ అవగాహన, అభివృద్ధి, పరిరక్షణ కోణాలను ఆవిష్కరించేలా ప్రభుత్వాలు విధానాలు రూపొందించుకోవాలన్నారు. పర్యాటక ప్రదేశాలను గుర్తించడమే కాకుండా వాటిని అభివృద్ధి చేసి పెద్దఎత్తున ప్రచారం కల్పించాలన్నారు. బెంగళూరులోని గార్డెన్ సిటీ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ సుమిత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ దేశంలో పర్యాటక రంగంలో పరిశోధన అధ్యయనాలు ఊపందుకున్నాయని, వాటి ఫలాలను అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వాలు చురుగ్గా వ్యవహరించాలన్నారు. కళాశాల స్థాయి నుంచి పర్యాటక రంగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తే వారు అపారమైన అవకాశాలు అందిపుచ్చుకోగలరన్నారు. కళాశాల వైస్-ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి, సదస్సు సమన్వయకర్త డాక్టర్ వెంకటరమణయ్య, గుల్బర్గా కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు గంగినేని రంగనాథం, డిగ్రీ కళాశాల అధ్యాపకులు సంధ్యా ఆదూరి, రఫీ, ఖాదర్ బాషా, ప్రశాంత, వివిధ వర్సిటీల అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయం తరలింపు

కలికిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో ఉన్న డిప్యూటీ జిల్లా మెడికల్, ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని కుప్పం తరలిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ అనుమతులు కూడా పొందినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు శుక్రవారం జీఓ నంబరు 155 జారీ చేశారు. కాగా మదనపల్లెను జిల్లా కేంద్రం చేయాలన్న ప్రజల డిమాండుకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి సానుకూలత వ్యక్తమవుతున్న నేపథ్యంలో అక్కడ ఏకంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాల్సి ఉన్నందున ప్రస్తుత డిప్యూటీ ఎంహెచ్ఓ కార్యాలయం అవసరం వుండదన్న ఉద్దేశంతో ఈ కార్యాలయాన్ని కుప్పంకు తరలిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెపుతున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కడపరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి కడప జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి గల్లా శ్రీదేవి తెలిపారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టులలో 20 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కడపలో 5, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 2, రాయచోటిలో 3, బద్వేల్‌లో 2, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం కోర్టుల్లో ఒక్కొక్క బెంచ్ ఏర్పాటు చేశామన్నారు. రాజంపేటలోని మూడవ అదనపు జిల్లా కోర్టుకు సంబంధించిన కేసులను కడప నాల్గవ అదనపు జిల్లా కోర్టు బెంచ్‌లో పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే రైల్వేకోడూరు కోర్టుకు సంబంధించిన కేసులు రాజంపేట ఏడీఎం కోర్టు బెంచ్‌లో, సిద్దవటం కోర్టుకు సంబంధించిన కేసులు బద్వేల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు బెంచ్‌లో పరిష్కరిస్తారన్నారు. కక్షిదారులు తమ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందాలని సూచించారు.

రిమాండ్‌కు వైసీపీ కార్యకర్త సుధారాణి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమార్తెపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన నిందితురాలు, వైసీపీ కార్యకర్త సుధారాణిని రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. గత నెల 1వ తేదీన మదనపల్లెకు చెందిన జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం మదనపల్లె టూటౌన్‌లో ఈమెపై ఫిర్యాదు చేశారు. దీంతో గుంటూరు జిల్లా నరసారావుపేటకు చెందిన పెద్దిరెడ్డి సుధారాణి (32) నిర్వహిస్తున్న రెడ్డిగారి అమ్మాయి, రెడ్డి 2022 సామాజిక మాధ్యమ ఖాతాల నుంచి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కుమార్తెలపై పోస్టులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే గుంటూరులో అరెస్టు చేశారు. గురువారం రాత్రి ఆమెను పీటీ వారెంట్‌పై గుంటూరు నుంచి మదనపల్లెకు పోలీసులు తీసువచ్చి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం నిందితురాలను మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచి తిరిగి గుంటూరుకు రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ తెలిపారు.

బ్రౌన్ శాస్త్రి.. జానమద్ది



తెలుగువారి గుండెల్లో శాశ్వత స్థానం ● నేడు జానమద్ది శతజయంతి స్మారకోపన్యాసం
స్మారక ఉపన్యాస పరంపర వేడుకలు ● హాజరుకానున్న విశ్రాంత చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు సూర్యుడు సీపీబ్రౌన్, ప్రముఖ సాహితీవేత్త జానమద్ది హనుమశాస్త్రి కలగలిసిన పరిశోధన కేంద్రమే సీపీబ్రౌన్ స్మారక గ్రంథాలయం. అది గ్రంథాలయమే కాదు ఎన్నో గ్రంథాల సంపుటాలు, చరిత్రకు అందించే సంక్షిప్త వివరాలు, విరబూసిన సాహితీ కుసుమాల సమాహారంగా నిలిచింది. కడప పట్టణంలో సీపీబ్రౌన్ స్మారక గ్రంథాలయం నెలకొల్పి నిరంతరం శ్రమించి ఎన్నో సాహితీ కార్యక్రమాలను నిర్వహించి తెలుగునాట బహుముఖ సాహితీవేత్త, విశ్వంభర గ్రంథకర్త, డాక్టర్ సి.నారాయణరెడ్డిచే బ్రౌన్ శాస్త్రిగా గౌరవించబడ్డారు జానమద్ది హనుమశాస్త్రి. గ్రంథాలయాన్ని నిర్మించి తెలుగువారి గుండెల్లో శాశ్వత స్థానం కల్పించిన మహోన్నతులు డాక్టర్ జానమద్ది శతజయంత్యుత్సవాలు శనివారం వేడుకగా నిర్వహించనున్నారు. వివరాల్లోకెళితే...

రాష్ట్రంలో అత్యంత వెనకబడిన అనంతపురం జిల్లా రాయదుర్గం వాసులు జానకమ్మ, సుబ్రమణ్యశాస్త్రి పుణ్యదంపతుల ముద్దుల పట్టి జానమద్ది హనుమశాస్త్రి 1925 అక్టోబరు 20న జన్మించారు. రాయదుర్గం జిల్లా బోర్డు హైస్కూల్లో ఎస్ఎస్ఎల్సీ వరకు చదుకుంటూనే ప్రైవేట్‌గా బీఏ, బీఎడ్ పూర్తిచేశారు. పట్టుదలతో తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రావీణ్యం సాధించారు. అంతేకాకుండా తెలుగు ఆంగ్ల భాషల్లో ఎంఏ పట్టా సాధించారు. తర్వాత బళ్లారిలోని ప్రభుత్వ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా ఉద్యోగ ప్రస్థానం ఆరంభించారు. జానమద్ది శాస్త్రి కథా రచయితగానే కాకుండా వివిధ పత్రికలకు 2500పైగా వ్యాసాలు, 16 గ్రంథాలు రాశారు. సీపీ బ్రౌన్ మీద పరిశోధన చేశారు. ఫలితంగా కడప పట్టణంలో సీపీబ్రౌన్ స్మారక గ్రంథాలయం నెలకొల్పి నిరంతరం శ్రమించి పరిశోధన కేంద్రం స్థాయికి తీసుకెళ్లారు. సాహిత్యంలో పట్టున్న ఆయన ఎన్నో సాహితీ కార్యక్రమాల ద్వారా ఎందరో సాహితీ ప్రముఖులను ఆహ్వానించారు. ఆయన శ్రమను గుర్తించిన తెలుగునాట బహుముఖ సాహితీవేత్త, విశ్వంభర గ్రంథకర్త, డాక్టర్ సి.నారాయణరెడ్డిచే బ్రౌన్ శాస్త్రిగా గౌరవించారు. ఎంతో చరిత్ర కలిగి సదాస్మరణీయ పండితులుగా ఖ్యాతి దక్కించుకున్న జానమద్ది తెలుగువారి గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. బ్రౌన్ గ్రంథాలయం కోసం నిరంతరం శ్రమించిన ఆయన 2014 ఫిబ్రవరి 28న తుదిశ్వాస విడిచారు. అందరికీ జానమద్ది, ఎందరికో జ్ఞానమద్దియని, బ్రౌన్ గ్రంథాలయ భవనానికి నిలువెత్తు ద్వారమై నిలిచారని ప్రశంసలు అందుకున్న మహోన్నత సాహితీవేత్త. స్ఫూర్తి ప్రదాత జానమద్ది సాహితీ సేవలు సదాస్మరణీయం.

సాహితీ సేవలు

కడపలో సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయ ట్రస్టును నెలకొల్పి కార్యదర్శిగా ఉంటూ అహర్నిశలు శ్రమించి రూ.10లక్షల విరాళాలు సేకరించారు. ఈ కేంద్రానికి 15వేల గ్రంథాలను శాస్త్రి సేకరించి బ్రౌన్ ద్విశతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించి బ్రౌన్ శాస్త్రిగా పేరుగాంచారు. 1973లో కడప జిల్లా రచయితల సంఘం స్థాపించి 20ఏళ్లు కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్రంలోని సుప్రసిద్ధ రచయితలను కడప జిల్లాకు పరిచయం చేశారు. బెజవాడ గోపాలరెడ్డి, ఆరుద్ర, దాశరథి, కుందుర్తి, పురిపడా అప్పలస్వామి, శ్రీశ్రీ, సి.నా.రె., దేవులపల్లి రామానుజరావు, దివాకర్ల వెంకటావధాని వంటి రచయితలను కడప జిల్లాకు ఆహ్వానించి చక్కని కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

ప్రముఖ గ్రంథ రచనలు

మా సీమకవులు, నాట్యకళా ప్రపూర్ణ బళ్లారి రాఘవ (జీవిత చరిత్ర), కస్తూరి కన్నడ సాహిత్య సౌరభం, కడప సంస్కృతి-దర్శనీయ స్థలాలు, మన దేవతలు, భారతరత్నం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత చరిత్ర, సీపీ బ్రౌన్ చరిత్ర, మొండి గోడల నుంచి మహాసౌధం దాకా, విదురుడు, త్యాగమూర్తుల మనిషి, నీకు అసాధ్యమేదీ, ఎందరో మహాద్భావులు, భారత మహిళ, శంకరంబాడి సుందరాచారి, పురస్కారాలు, సత్కారాలు అనేక అవార్డులు లభించాయి. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి గౌర డాక్టరేట్, లోకనాయక్ ఫౌండేషన్ సాహితీ పురస్కారం, (2011) గుంటూరులో అయ్యంకి వెంకటరమణయ్య అవార్డు, అనంతపురం లలిత కళా పరిషత్ అవార్డు, ధర్మవరం కళాజ్యోతి వారి సిరిని ఆంజనేయులు అవార్డు, కడప సవేరా ఆర్ట్స్ వారి సాహితీ ప్రపూర్ణ అవార్డు, మదనపల్లె భరతముని కళారత్న అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, బెంగుళూరులో అఖిల భారత గ్రంథాలయ మహాసభ పురస్కారం, ఉడిపి పెజావరు పీఠాధిపతిచే ధార్మికరత్న బిరుదు మొదలైనవి సాధించారు.



సీపీ బ్రౌన్ గ్రంథాలయం ఇన్‌సెట్‌లో జానమద్ది కాంస్య విగ్రహం

హాజరు కానున్న జస్టిస్ ఎన్వీ రమణ

కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం జానమద్ది శతజయంతి స్మారక ఉపన్యాస పరంపరలో భాగంగా తెలుగు భాషా వైభవం పేరిట జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రధాన వక్తగా మాజీ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ హాజరు కానున్నట్లు జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా కవిత విద్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, వైవీయూ రిజిస్ట్రార్ పి.పద్మ తదితరులు పాల్గొంటారన్నారు.

నేటి నుంచి కాశినాయన ఆరాధనోత్సవాలు

● 35 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ● 175 మంది పోలీసులతో బందోబస్తు

కాశినాయన డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): వరికుంట్ల సమీప జ్యోతి క్షేత్రంలో కాశిరెడ్డినాయన 29వ ఆరాధనోత్సవాలు శనివారం నుంచి వేడుకగా ప్రారంభమవుతున్నట్లు నిర్వహకులు తెలిపారు. రెండు రోజులు నిర్వహించే ఉత్సవాల్లో మొదటిరోజు గణపతి పూజతో ప్రారంభమై హోమాలు, కాశినాయన పాలరాతి సమాధికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రాత్రికి జ్యోతి ప్రజ్వలన, రథోత్సవం ఉంటుంది. 15న కాశినాయన యోగ సమాధికి అభిషేకం, రాత్రి నిర్వహించే పల్లకి ఉత్సవంతో ఆరాధనోత్సవం ముగుస్తుంది.



కాశినాయన కాంస్య విగ్రహం - విద్యుత్ దీపాలంకరణలో ఆలయం ముఖ ద్వారం

విద్యుత్ దీపాలతో ఆలయం ముస్తాబు

కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాల కోసం ఆలయం ముస్తాబు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణ చేశారు. ఆలయం ముందు భాగంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. లక్ష్మీనరసింహ స్వామి, గరుడుడు, హనుమంతుల వారి ముఖాలను ముస్తాబు చేసి ఆలయం ముందు భాగం ప్రవేశ ద్వారం ముస్తాబు చేశారు.

35 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

కర్నూలు, గుంటూరు, ఒంగోలు జిల్లాల నుంచి కాశినాయన ఆరాధకు వచ్చే భక్తుల సౌకర్యార్థం గిద్దలూరు బస్టాండు, రైల్వేస్టేషన్ నుంచి 15 ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు గిద్దలూరు డిపోమేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. కడప జిల్లాలోని మైదుకూరు, పోరుమామిళ్ల, బ్రహ్మంగారి మఠం నుంచి 20 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు మైదుకూరు సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయమ్మ తెలిపారు. 14వ తేదీ ఉదయం నుంచి 15 వతేదీ రాత్రివరకు ఈసర్వీసులు నిరంతరం నడుస్తాయన్నారు.



అన్నదానం కోసం భక్తులు ఇచ్చిన కూరగాయలు

175 మంది పోలీసులతో బందోబస్తు

కాశినాయన ఆరాధన కోసం మైదుకూరు డీఎస్పీ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు అధ్యక్షతన 175 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. ముగ్గురు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలు, 149 మంది పోలీసులు, 15 మహిళా పోలీసులు విధుల్లో ఉంటారన్నారు.

పత్తూరులో ఉత్సవాలు

ఖాజీపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు పత్తూరులో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం వేకువజాము నుంచే మహాగణపతి, అన్నపూర్ణాదేవి, నవగ్రహాలకు, కాశిరెడ్డినాయన మూలవిరాట్టుకు అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం చెక్కభజన (కులుకు), సాయంత్రం కోలాటాలు, రాత్రి భక్త చింతామణి, ఆదివారం ఉదయం 7 గంటలకు స్వామివారికి మహానైవేద్యం, 10 గంటల నుంచి హరినామ తాళభజన నిర్వహిస్తారని కమిటీ తెలిపింది. విజేతలకు బహుమతులు అందజేస్తున్నట్లు వివరించారు. భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు భారీ ఎత్తున అన్నదానం నిర్వహించనున్నారు.

బండలాగుడు పోటీలు

కాశిరెడ్డినాయన ఆరాధనోత్సవాలు పురస్కరించుకుని వృషభరాజములకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, 4వ బహుమతి రూ.20 వేలు, 5వ బహుమతి రూ.10 వేలు, 6వ బహుమతి రూ.5 వేలు చెల్లించనున్నారు. కాగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా గట్టి బందోబను ఏర్పాటు చేయనున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.



ముస్తాబైన వీఎన్‌పల్లెలోని కాశినాయన ఆలయం

వీరపునాయునిపల్లె: మహిమాన్వితుడు అన్నదాన ప్రభువు అనునిత్యం భక్తుల నోట పిలవడమే అవధూత కాశిరెడ్డినాయన ఆలయంలో ఆరాధన ఉత్సవాలకు ముస్తాబైంది. మండలంలోని ఎన్.పాలగిరి క్రాస్ వద్ద నున్న కాశినాయన 29వ ఆరాధన జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 15వ తేదీన ఆదివారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భజన కార్యక్రమాలు, సంకీర్తనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు మెరవణి నిర్వహించడం జరుగుతుందన్నారు. అమ్మఒడి చారటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. లాగే న్యూకేటగిరి రాష్ట్రస్థాయి విభాగంలో బండలాగుడు పోటీలు జరుగుతాయని చెప్పారు. భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

డాక్టరు రమేష్‌బాబుపై డీఎంహెచ్ఓ విచారణ



ఆస్పత్రిలో విచారణ చేపడుతున్న డీఎంహెచ్ఓ

నిమ్మనపల్లి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారిగా పని చేస్తున్న రమేష్‌బాబుపై శుక్రవారం అన్నమయ్య జిల్లా డీఎంఅహెచ్ఓ కొండయ్య విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ నాగేంద్రబాబు సీఎం పేషీకి డాక్టరు రమేష్‌బాబుపై ఉన్నతాధికారుల అనుమతి లేకుండా జీతం నిలిపివేయడం, అటెండెన్స్ ఇవ్వక పోవడం, ఎఫ్ఆర్ఎస్ కట్‌చేసి సరెండర్ చేయండంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో సిబ్బంది, డాక్టరును విచారించి దీనిపై పూర్తి వివరాలను ఉన్నతాధిరులకు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. అయితే నాగేంద్రబాబు గతంలో డీఎంహెచ్ఓకు తాను ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోక పోవడంతో సీఎం పేషీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం డీఎంహెచ్ఓ కొండయ్య రికార్డులను పరిశీలించి సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు.

వ్యవసాయం ఆయన ఉద్యోగం

నోరు ఎర్రన.. బతుకు పచ్చన.... ● కడుపు నింపే కొత్త వరివంగడాలు
సంప్రదాయ ఎరువులతో సాగు ● పంటల సాగుతో ఆకట్టుకుంటున్న రైతు



ఆశాజనకంగా కనపడుతున్న చీనీ చెట్లు

దువ్వూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం అనేక రకాల పనులను చేస్తుంటారు. కొందరు ఉద్యోగం, మరికొందరు చేతి వృత్తులు, మరికొందరు సొంత పనులు, వ్యాపారం, గ్రామాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఇందులో జీవన భృతి కోసం మొదట ఎంచుకునేది ఉద్యోగం. చిన్న ఉద్యోగమైనా నెల తిరిగేలోపు జీతం వస్తుందని, జీవితానికి భరోసాగా ఉంటుంది. దీంతో గ్రామాలను సైతం వదిలేసి పట్టణాల్లో ఉద్యోగాలకు, చేతి వృత్తులు, సొంత వ్యాపారం చేసుకుంటుంటారు. అయితే ఇక్కడ ఒక రైతు వ్యవసాయమే ఉద్యోగంగా ఎంచుకుని జీతం కంటే అధికంగా ఆర్జిస్తున్నారు. మొక్కుబడి వ్యవసాయం చేయకుండా నేల సార వంతాన్ని గమనిస్తూ సంప్రదాయ ఎరువులు, మందులు వినియోగిస్తూ భూమి పోషక విలువలను అందిస్తూ పంటలో పట్టుసాధిస్తున్నారు బండి చలపతి చేస్తున్న ఉద్యోగం వివరాల్లోకెళితే....




తమలపాకుల తోట

దువ్వూరు మండలం రాంసాయినగర్ వాసి రైతు బండి చలపతి అందరికీ భిన్నంగా పంటలసాగుకు పూనుకుంటున్నారు. చిన్నప్పటి నుంచే వ్యవసాయాన్ని ప్రాణంగా చేస్తున్నాడు. 35 ఏళ్లగా వ్యవసాయం అనే ఉద్యోగం చేస్తున్నారు. ఫలితం గా ఉద్యోగులకంటే ఎక్కువగా ఆర్జిస్తున్నారు. రసా యనిక ఎరువులు, పురుగుల మందులను వినియోగించకుండా సంప్రదాయ ఎరువులు, కషా యాలను వాడుతున్నారు. ఆవుల ద్వారా ద్రవ, ఘన జీవామృతాలు, సొంతంగా తయారు చేసుకున్న కషాయాలను వాడుతూ ఇతర రైతులను కూడా చైతన్య పరుస్తుంటారు. వ్యవసాయం మొక్కుబడిగా చేయరాదని, పంటల మార్పిడితో ఆశాజకంగా దిగుబడి వస్తుందని, విచక్షణా రహితంగా పురుగు మందుల వాడకం, రసాయనిక ఎరువులు చల్లడం మంచిది కాదని ఆయన రైతులకు వివరిస్తుంటారు. తినే పంటలో కూడా అవే విషపదార్థాలు తయారై మానవుని జీవన ప్రమాణాన్ని తగ్గిస్తుందని, అంతేకాకుండా నేల సారవంతం తగ్గిపోయి, భూమికి తగిన పోషక విలువలు తగ్గిపోతాయని, ఫలితంగా రైతులు సాగులో పట్టు కోల్పోతూ నష్టాలు చవిచూస్తుంటారని పలు సందర్భాల్లో రైతులకు వివరిస్తుంటారాయన. దీం తో ఆప్రాంతంలో చలపతి గురించి తెలియనివారుండరనడం అతిశయోక్తి కాదు. ఆయనకున్న 15 ఎకరాలకు తోడు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకుని పంటల సాగు చేపట్టారు. ప్రస్తుతం తమలపాకు, పసుపు, చీనీ చెట్లు ఈ ప్రాంతంలో ఎవరూ సాగు చేయని వరి వంగడాలు వేశారు. రత్నచూడు, బహురూపి, చిట్టిముత్యాలు వంటి కొత్త వంగడాలను ఇతర రాష్ట్రాల నుంచి తెప్పిం చి వరి పంటను సాగు చేశారు. మన ప్రాంతంలో వరి ధాన్యం రేటు కంటే బస్తాపై వెయ్యి నుంచి రూ.1500 అధిక రేటు పలుకుతాయి. ఈ గింజలకు సంబంధించిన రైస్‌ను షుగర్ పేషెంట్లు కూడా తినవచ్చని రైతు చలపతి వివరిస్తున్నారు. ఈ విషయం డాక్టర్లు సైతం ధృవీకరించారని అంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. తమలపాకు, చీనీ ధరలు నరేసరి. ఇప్పటికే కొంత విస్తీర్ణంలో అంజూర, సపోట వంటి పంటలు సాగుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటా లాభసాటి వ్యవసాయంపైపే ఈయన మొగ్గు చూపుతున్నారు. ఈ ప్రాంతంలో గతంలో బొప్పాయి, ఖర్బూజ, అంజూర, ఇతర పంటలు సాగు చేశారు. కొత్తరకం పంటల సాగుతో ఆశాజనక దిగుబడులు సాధిస్తూ మిగతా రైతులకు ఆదర్శప్రాయుడిగా నిలుస్తున్నాడు.



రత్నచూడు రకం వరి

వరి సాగులో రసాయనిక మందులు వాడను



మొక్కుబడిగా వ్యవసాయం చేయడం నాకు నచ్చదు. కొత్త వరి వంగడాల సాగులో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకానికి నేను దూరం. జనుము, జీలుగ మాత్రమే పచ్చిరొట్ట ఎరువుగా వాడతాను. ఆవు మూత్రంను వినియోగిస్తాను. పంటలకైన పెట్టుబడులు బాగా తగ్గిస్తాను. ప్రకృతి వ్యవసాయం అంటే నాకు ఇష్టం. లాభదాయక పంటల సాగుపై మొగ్గుచూపుతాను.

బండి చలపతి, రాంసాయినగర్, దువ్వూరు మండలం

బోగస్ పింఛన్ల ఏరివేతకు రంగం సిద్ధం



లక్ష్మీపేటలో పింఛన్లు తనఖీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)



● దివ్యాంగ పింఛన్లపైనే అనుమానాలు ● ఇప్పటికే వేయికి పైగా గుర్తింపు ● వృద్ధాప్య పింఛన్లపై కూడా..

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల సామాజిక భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లలో బినామీలు పొందుతున్న బోగస్ పింఛన్ల ఏరివేతకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తోంది. ఇప్పటికే జిల్లాలో ఈ కార్యక్రమం పైలెట్ ప్రాజెక్టు కింద చాపాడు మండలంలోని లక్ష్మీపేటలో మొదలు పెట్టడం జరిగింది. సోమవారం చేపట్టిన విచారణలో 380 మంది లబ్ధిదారులు అందుబాటులో ఉండగా... 20 మంది అందుబాటులో లేరని తెలుస్తోంది. అధికారులు తనిఖీ చేసిన పింఛన్‌లలో ఎంత మంది అర్హులు అనేది అధికారులు చెప్పడం లేదు. నివేదిక ప్రభుత్వానికి సమర్పిస్తామని విచారణ అధికారులు పేర్కొన్నారు. రెండవ రోజు మంగళవారం మిగిలిన 20 పింఛన్లకు సంబంధించి విచారణ చేపట్టగా.. నలుగురు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకార నిక్కచ్చిగా సర్వే నిర్వహిస్తే .. పెద్దఎత్తున పింఛన్లు గల్లంతయ్యే అవకాశాలు ఉన్నాయి. నిరుపేదల మాటున చాలా మంది అనర్హులు పింఛన్ పొందుతున్న సందర్భాలు ఉన్నాయి. గతంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వంలో వేల సంఖ్యలో పింఛన్లు పెరిగిపోవడం చూస్తే పింఛన్ల లబ్ధిదారుల అర్హతలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో లబ్ధిదారుల ఆస్తులను అంచనా వేయడం కష్టతరంగా మారుతోందని తెలుస్తోంది. చాలా మంది తమ ఆస్తులను గోప్యంగా ఉంచి పింఛన్లు పొందుతున్నట్లు తెలుస్తోంది.

దివ్యాంగ పింఛన్లపైనే అనుమానాలు...

గత ప్రభుత్వ హయాంలో వికలత్వపు పింఛన్లు భారీగా పెరిగాయి. పింఛన్ల కోసం మాయరోగాన్ని సృష్టించుకొని కొంతమంది ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. వీటిపై భారీ స్థాయిలో ఆరోపణలు రావడంతో 1087 బోగస్ సదరం సర్టిఫికెట్లను ఆగస్టు నెలలో వైద్యాధికారులు గుర్తించారు. జిల్లాలో వివిధ మండలాలకు చెందిన వ్యక్తులు ఇతర జిల్లాలలో ఉన్న ఆసుపత్రుల ద్వారా సర్టిఫికెట్లు పొందినట్లు గుర్తించారు. ఈ క్రమంలో మరిన్ని పింఛన్లలో అర్హులు ఎంతమంది ఉన్నారని దానిపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. ఇదే అంశంపై గురువారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిపై జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్చించారు. రాష్ట్రంలో వివిధ సామాజిక పింఛన్లు అర్హులకు అందేలా, అనర్హులను తొలగించేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా వికలత్వపు ధ్రువీకరణ కోసం సాంకేతిక, హైబ్రిడ్ విధానాలను వినియోగించి ఫిజికల్ వెరిఫికేషన్‌తో అనర్హులను తొలగించాలని సూచించారు. అదేవిధంగా వికలాంగులకు జారీ చేసే సదరం సర్టిఫికెట్ల జారీలో అక్రమాలను పూర్తిగా నివారించాలన్నారు. సర్టిఫికెట్లు జారీచేసే డాక్టర్లు మెడికల్ బోర్డు మార్గదర్శకాలు సక్రమంగా పాటిస్తున్నారా లేదా పరిశీలించాలన్నారు. ఎక్కడైనా సదరం సర్టిఫికెట్ల జారీలో మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే సంబంధిత డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్లను ఆదేశించారు.

వృద్ధాప్య పింఛన్లపై కూడా...

వృద్ధాప్య పింఛన్లు వయసు ఆధారితంగా మంజూరు అవుతున్నాయి. ఈ క్రమంలో వాస్తవంగా తక్కువ వయస్సు ఉన్నప్పటికి ఆధార్‌కార్డులో వయస్సు పెంచుకొని పింఛన్లు పొందుతున్న వారు కూడా జిలల్లాలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో నిజమైన అర్హులు పింఛన్ పొందే అవకాశాన్ని కోల్పోతున్న పరిస్థితి. ప్రస్తుతం జిల్లాలో గత నెలలో 1,34,717 మందికి వృద్ధాప్య పింఛన్లు, 37,785 మందికి వికలత్వపు పింఛన్లు, 940 మందికి పూర్తి వికలత్వపు పింఛన్లు, 58410 మందికి వితంతు పింఛన్లు, 3836 మంది ఒంటరి మహిళల కింద పింఛన్లను పంపిణీ చేశారు. ప్రధానంగా ప్రభుత్వం వీటిపైనే దృష్టి సారించనుంది. వికలత్వ పింఛన్లలో అధికభాగం వినికిడి లోపం మానసిక వికలత్వం సర్టిఫికెట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం మేరకు విచారిస్తే పింఛన్ల జాబితా నుంచి ఎక్కువ సంఖ్యలోనే అనర్హులు దొరికిపోయే అవకాశాలు కూడా లేకపోలేదు.

20,24 తేదీలలో అంతర్ కళాశాలల యోగా, ఖోఖో క్రీడా పోటీలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల యోగా, ఖోఖో క్రీడా పోటీలు వైవీయూ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 20న యోగా, 24న ఖోఖో పోటీలు స్త్రీ, పురుషులకు ఉంటాయన్నారు. ఈ క్రీడలలో పాల్గొనే ఆసక్తిగల విద్యార్థులు 2024 జూలై 1వ తేదీ నాటికి 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు కలిగి, విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో చదువుతూ ఉండాలన్నారు. విద్యార్థులు స్టడీ, టెన్త్ మార్క్సుమెమో, ఇంటర్మీడియట్ మార్క్స్ మెమో ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 9705459052, 7997047676 నెంబర్లను సంప్రదించాలన్నారు.

22న సన్నపురెడ్డికి కేతు స్మారక జీవిత సాఫల్య పురస్కారం

కడప కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాసి ప్రముఖ కథా నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డికి ఈనెల 22వ తేదీ ఆదివారం నగర సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, స్వర్గీయ కేతు విశ్వనాథరెడ్డి స్మారక జీవిత సాఫల్య పురస్కారం అందించనున్నట్లు కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి వెల్లడించారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి సుమారు 80 కథలు, 7 నవలలు రాశారన్నారు. ఆయన రాసిన చాలా కథలు హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువాదమయ్యాయన్నారు. ప్రధానంగా ఆయన రాసిన మొదటి కాడి అనే నవల అమెరికా వారి తానా నవలల పోటీలో బహుమతి దక్కించుకుందన్నారు. కొండపొలం అనే నవల అదే పేరుతో సినిమాగా కూడా రూపొందిన సంగతి తెలిసిందే అన్నారు. కాగా, తమ కుమార్తె కవిత స్మారకార్థం గత 2010లో సంస్థను ఏర్పాటు చేసి పలు సాహిత్య, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రతి యేడాది వివిధ ప్రక్రియలలో రచయితలకు పురస్కారాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. గత యేడాది మన జిల్లా వాసి ప్రసిద్ధ రచయిత కేతు విశ్వనాథరెడ్డి స్వర్గస్థులైన నేపథ్యంలో ఆయన స్మారకార్థం కేతు స్మారక జీవిత సాఫల్య పురస్కారం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమానికి కవులు, రచయితలు హాజరై సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

లారీ, బైకు ఢీ...ఇద్దరికి గాయాలు



ప్రమాద స్థలంలో లారీని ఢీకొన్న బైకు

ముద్దనూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కడప తాడిపత్రి జాతీయ రహదారిలోని గంగాదేవిపల్లె వద్ద శుక్రవారం లారీ, బైకు ఢీ కొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి.
స్థానికుల సమాచారం మేరకు.. తాడిపత్రి వైపు నుంచి ముద్దనూరు వైపు లారీ వెలుతుండగా గంగాదేవిపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జున(30), రామచంద్ర(31)లు బైకు పై గ్రామంలో నుంచి వచ్చి రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. వెంటనే 108లో చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు తరలించినట్లు సమాచారం.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

రాయచోటిటౌన్/ ఖాజీపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లోని పలు ఎరువుల దుకాణాల్లో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కడప విజిలెన్స్ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, వ్యవసాయ అధికారులతో కలిసి కడప జిల్లాలోని ఖాజీపేట మండల కేంద్రంలో గల శ్రీలక్ష్మి గణేశ్ ట్రేడర్స్, శ్రీవెంకటేశ్వర రైతు ఏజెన్సీలతో పాటు అన్నమయ్య జిల్లా పరిధిలోని పీలేరు మండల కేంద్రంలో గల శ్రీవెంకటేశ్వర ఫర్టిలైజర్స్, శ్రీ శ్రీనివాస ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో తూకాల్లో తేడాలు, రికార్డుల్లో స్టాక్ వ్యత్యాసాలు, అధిక ధరలు అమ్మడం వంటివి గుర్తించారు. ఇందులో భాగంగానే మెట్రాలజీ యాక్ట్ అండ్ రూల్స్ 2009, 2011 ప్రకారం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ద్వారా రూ.1.50 లక్షలతో పాటు జీఎస్టీ యాక్ట్ ప్రకారం రూ.50వేలు జరిమానా విధించారు. అలాగే ఎఫ్‌సీఓ 1985, అర్బన్ సీ 28(1)(డీ) ప్రకారం వ్యవసాయ అధికారుల ద్వారా రికార్డుల్లో స్టాక్ వ్యత్యాసాలు ఉండడం వలన 23.25 మెట్రిక్ టన్నుల ఎరువులకు (రూ.4,75,370 విలువ గల) స్టాప్ సేల్స్ నోటీసులు జారీ చేశారు. స్టాక్ రికార్డులు స్వల్ప తేడాలు ఉన్నందునపై దుకాణ యజమానులకు అమ్మకం, నిలుపుదల నోటీసులు ఇచ్చారు. నియమ నిబంధనలకు అనుగుణంగా ఎరువులను, విత్తనాలను, పురుగు మందులను రైతులకు విక్రయించాలని, లేనిచో చర్యలు తప్పవని కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావుతో పాటు విజిలెన్స్ అధికారులు ఏపీ జవహర్‌రెడ్డి, డీఈఈ బాలగంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ విజయ్‌కిశోర్, ఏఈఈలు అశోక్‌కుమార్, ఖాజాహుస్సేన్, డీసీటీవోలు బాబు మోజెస్, రమేశ్‌రెడ్డి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఖాజీపేట వ్యవసాయ అధికారి నాగార్జున, పీలేరు వ్యవసాయ అధికారిణి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఖాజీపేటలోని ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వృద్ధులపై యువకుడి వీరంగం...!

● ముగ్గురికి తీవ్ర రక్తగాయాలు

గుర్రంకొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు వీరంగం సృష్టించి ఆరుగురు వృద్ధులపై దాడి చేసి గాయపరిచిన సంఘటన మర్రిమాకులపల్లెలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామస్థులు, బాధితుల వివరాల మేరకు మండలంలోని మర్రిమాకులపల్లెకు చెందిన జయరామిరెడ్డి కుమారుడు దిలీప్‌కుమార్‌రెడ్డి(25) చెడువ్యసనాలకు బానిసగా మారాడు. ఈ క్రమంలో ప్రతి రోజు మద్యం సేవించి గ్రామంలో గొడవలకు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి రచ్చబండ వద్ద కూర్చొని ఉన్న వృద్ధులపై మద్యం మత్తులో కర్రతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో రామలక్ష్మమ్మ(75), లక్ష్మమ్మ(80), హేమవతమ్మ(60)లకు కాళ్లు విరిగాయి. అలాగే ఈశ్వరమ్మ(50), ఎస్.లక్ష్మమ్మ(65), కత్తి లక్ష్మక్క(55)లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గాయపడిన వృద్ధులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడడంతో కాళ్లు విరిగిన వృద్ధులను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. యువకుడి వీరంగంతో గ్రామంలో ప్రజలు భయాందోళలనకు లోనయ్యారు. ఈవిషయాన్ని పోలీసులకు తెలపడంతో ఎస్ఐ రామచంద్రుడు యువకుడిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

రామసముద్రం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబకూరు-ఈడిగపల్లె మార్గంలో గల నల్లచిన్నేపల్లె క్రాస్ వద్ద గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పుంగనూరు మండలం, నేతిగుట్లపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణ(66) తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వస్తూ ఉండగా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఇతనిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకటరమణ వెంకటరమణ గురువారం మృతి చెందాడు. అతని కుమారుడు మహేష్ ఫిర్యాదుపై ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మానవీయ విలువలతో కూడిన విద్య అవసరం

● వైవీయూ రిజిస్ట్రార్ పి.పద్మ



సావనీర్ విడుదల చేస్తున్న ముఖ్య అతిథులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మానవీయ విలువలతో కూడిన విద్య అవసరమని వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ తెలిపారు. శుక్రవార కడప నగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎంపవరింగ్ యూత్ రోల్ ఆఫ్ హ్యూమన్ వాల్యూస్ అండ్ ప్రొఫెషనల్ ఎథిక్స్ ఫర్ బెటర్‌టుమారో అనే అంశంపై ఒక్కరోజు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మానవీయ విలువలు చాలా అవసరమని.. విలువలతో కూడుకున్న విద్యను కలిగి ఉన్నపుడే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులంతా తమ గురువులు చెప్పిన జ్ఞానాన్ని విలువలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని సూచించారు. అమెరికా మిసిసిపి యూనివర్సిటీ నుంచి ఆన్‌లైన్ ద్వారా డాక్టర్ కల్లూరు రాజమోహన్ మాట్లాడుతూ యువత కృషి పట్టుదల క్రమశిక్షణ కలిగి ఉన్నట్లయితే తాము అనుకున్న లక్ష్యాలను సకాలంలో సాధించడానికి వీలవుతుందన్నారు. అనంతరం ఆధ్యాత్మిక గురువు వరదానంద, ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీంబాష, విశ్రాంత ప్రొఫెసర్ సత్తార్, వైవీయూ ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి, ప్రొఫెసర్ వినోదిని ప్రసంగించారు. అనంతరం అతిథులు సావనీర్ విడుదల చేశారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ సుజాత, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ గురుమోహన్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడ్డ చింతచెట్టు తప్పిన ప్రమాదం



రామసముద్రం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం-చెంబకూరు రోడ్డు మార్గంలోని శనేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం చింతచెట్టు విరిగిపడింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనదారులు ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వంద ఏళ్లనాటి వృక్షం కావడం.... గత వారం రోజులుగా వర్షం పడుతుండటంతో మహావృక్షం చెట్టు కూలిపోయి రోడుపైకి వాలింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని చెట్టు కొమ్మలను తొలగించి వాహనాలు రాకపోకలు పునరుద్ధరించారు.

యూనివర్సిటీ ఎస్టాబ్లిష్‌మెంట్ కోఆర్డినేటర్‌గా సునీత

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైవీయూ భూగర్భశాస్త్ర విభాగం ప్రొఫెసర్ వి.సునీతను యూనివర్సిటీ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం కోఆర్డినేటర్‌గా, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (ఆర్‌టీఐ)గా నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అందజేశారు. ఈ స్థానంలో పనిచేస్తున్న కోఆర్డినేటర్ ఆచార్య గంగిరెడ్డి, పీఐఆర్‌టీఐపీఐఓపీ శివారెడ్డి పదవీకాలం పూర్తికావడంతో రిలీవ్ అయ్యారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం రామిరెడ్డిలేవుట్‌లో శుక్రవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.25,750 నగదును స్వాధీనం చేసుకొని.. రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నేడు జూనియర్ కళాశాలలకు సెలవు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రెండో శనివారం సందర్భంగా జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలకు సెలవు దినంగా ప్రకటించడమైందని ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్కడైన జూనియర్ కళాశాలలు తరగతులు నిర్వహిస్తే ఇంటర్‌మీడియట్ బోర్డు నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యం సమావేశం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు ఆర్ఙఎస్ జూనియర్ కళాశాలలో ఈనెల 15వ తేదీ ఉదయం 10గంటలకు ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యం సమావేశం నర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.నరసింహులు ఒక ప్రకటనల తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలల కరస్పాండెంట్లు హాజరు కావాలని కోరారు.

ఎట్టకేలకు అటవీ అనుమతులు

● పునః ప్రారంభం కానున్న కమలాపురం బ్రిడ్జి పనులు

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి హైవేపై కమలాపురం వద్ద నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి పనులకు ఎట్టకే లకు అటవీ అనుమతులు లభించాయి. సుమారు మూడేళ్ల కిందట వచ్చిన వర్షాలతో కమలాపురం సమీప పాపాఘ్ని నదిపై వంతెన కుంగిపోయింది. దీంతో కొన్ని నెలలు పాటు రాకపోకలు ఆగిపోయాయి. వాహనాలు తిరిగే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. దీంతో అధికారులు కుంగిన బ్రిడ్జిపైన కేవలం మనుషులు నడిచేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కొన్ని నెలలు పాటు ప్రజలు అవస్థలు పడ్డారు. ఎర్రగంట్ల ప్రాంతంలో సిమెంటు, నాపరాయి పరిశ్రమలు ఉండడంతో నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డులో తిరిగేవి. అయితే బ్రిడ్జి కూలిపోవడంతో వాహనాల రాకపో కలకు అంతరాయం జరిగింది. కొన్ని నెలల తర్వాత నదిలో నీరు తగ్గడంతో అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశారు. మరి కొంతకాలానికి అప్పటి ప్రభుత్వం నూతన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంది. టెండర్లు నిర్వహించి బ్రిడ్జి పనులు చేపట్టారు.

అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులు



అయితే బ్రిడ్జి నిర్మాణం రిజర్వ్ ఫారెస్ట్ స్థలంలో చేపట్టడంతో అటవీ అధికారులు పనులను నిలుపుదల చేయించారు. ఫలితంగా బ్రిడ్జి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఏళ్ల తరబడి అప్రోచ్ రోడ్డు వాహనాల రాకపోకలకు దిక్కు యింది. పనులు చేపట్టే ముందు సర్వే నిర్వహించి స్థల సేకరణలో బ్రేక్ పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ప్రకారం ఈనెల చివరి నాటికి బ్రిడ్జి పనులు పూర్తి కావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా బ్రిడ్జి నిర్మాణానికి అటవీ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపారు. కేంద్రం నుంచి అనుమతులు రావాల్సి వుండ డంతో కొంతవరకు జాప్యం ఏర్పడింది.

పుత్తా చొరవతో...

ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి కమలాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆయన బ్రిడ్జి నిర్మాణ పనులు ఆగి పోయి ప్రజలు అవస్థలు పడుతుండటం గమ నించి... ప్రభుత్వ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసు కొచ్చి పనులు పునఃప్రారంభించేందుకు ప్రయత్నిం చారు. దీంతో పాటు ఆయన తండ్రి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి త్వరగా అటవీ అనుమతులు వచ్చేందుకు చొరవ చూపారు. దీంతో ఎట్టకేలకు అనుమతులు లభించాయి. మరికొన్ని రోజుల్లో ఉత్తర్వులు వచ్చే అవకాలున్నాయి. దీంతో బ్రిడ్జికి సంబంధించి అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తయి రాకపోకలు కొనసాగే అవకాశాలున్నాయి.

బ్రిడ్జి పనులకు అనుమతులు వచ్చాయి

కమలాపురం రిజర్వు ఫారెస్ట్ పరిధిలో కమలాపురం సమీపంలోని నిర్మిస్తున్న బ్రిడ్జికి సంబంధించి అటవీ అనుమతులు లభించాయి. మరికొన్ని రోజుల్లో ఉత్తర్వులు రానున్నాయి.
- దివాకర్, ఇన్‌చార్జి జిల్లా అటవీశాఖ అధికారి.

రేపు అవగాహన సదస్సు

కడప(వినాయకనగర్), డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్జీఓ భవనంలో ఆదివారం డిపార్టుమెంటల్ పరీక్షలకు ఉచితంగా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్‌చంద్ర, అలీఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు పాల్గొంటారని తెలిపారు.

జేఎన్టీయూ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

పులివెందుల రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న 13 మంది విద్యార్థులు టీసీఎస్ కంపెనీలో ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శేషమహేశ్వరమ్మ తెలిపారు. ఇటీవల జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలో సీఎస్ఈ విభాగం నుంచి 10 మంది, ఈసీఈ విభాగం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థులను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌తో పాటు ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎస్.రాధాకృష్ణ, ఇతర అధ్యాపకులు అభినందించారు.

నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ మేనేజర్‌గా గుర్రప్ప



కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): కడప నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ మేనేజర్‌గా హెల్త్ సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటనారి గుర్రప్ప బాధ్యతలు చేపట్టనున్నారు. పరిపాలన సౌలభ్యం నిమిత్తం కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా గుర్రప్ప మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన కమిషనర్ మనోజ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తన వంతు బాధ్యతలు చక్కగా నెరవేరుస్తానని తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అనైతిక చర్య

● కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

పెండ్లిమర్రి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అభిమానంగా ఏర్పాటు చేసుకున్న అన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ధ్వంసం చేయడం అనైతిక చర్య అని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. ధ్వంసమైన ఎన్టీఆర్ విగ్రహాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె గ్రామ సమీపంలో రైతు కొప్పుల వెంకటసుబ్బయ్య తన పొలంలో ఇష్టంగా సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకున్న ఎన్టీఆర్ విగ్రహాన్ని దుండగులు ధ్వసం చేయడ దారుణమన్నారు. 2022 జనవరి 1వ తేదీన కమలాపురం టీడీపీ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డిచే ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ జరిగింది. ఎన్టీఆర్ విగ్రహం మెడ వరకు పగులగొట్టి చెయ్యి విరగొట్టారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించారు. ఈ ఘటన వెనుక ఉన్నవారు ఎంతటివారినైనా చట్టానికి అప్పగించి శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. అదే స్థలంలో త్వరలో మరో విగ్రహం ఆవిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

నేడు సాగు నీటి సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు

సింహాద్రిపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం మండలంలోని పులివెందుల బ్రాంచ్ కెనాల్(పీబీసీ) ఆయకట్టు పరిధిలో ఐదు డిస్ట్రిబ్యూటరీలకు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధం చేశారు. మండలంలోని అంకాళమ్మగూడూరు, హిమకుంట్ల, సింహాద్రిపురం, కసనూరు, బలపనూరు గ్రామాలకు చెందిన 4181 మంది ఆయకట్టు రైతులు ఓటర్లుగా జాబితాలో ఉన్నారు. కాగా ఈ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేయాలంటే ఆయకట్టుకు సంబంధించిన సెస్ తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంది. దీంతో ఎన్నికల్లో పోటీకి ఎవరు అర్హులన్నిది శనివారం తెలియాల్సి ఉంది.

పల్లె ప్రగతికి పాటుపడదాం

పులివెందుల రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పల్లెప్రగతికి పాటుపడదాం అని ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, ఈఓపీఆర్డీ శారద పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, ఈఓపీఆర్డీ శారద ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ లక్ష్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, ఏపీఓ, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పులివెందులలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

వల్లూరులో...

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అనే కార్యక్రమం పట్ల వల్లూరు ఎంపీడీఓ సభాభవనంలో శుక్రవారం రెండు రోజుల శిక్షణను ప్రారంభించినట్లు ఎంపీడీఓ రఘురామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. శిక్షకుల ఈఓపీఆర్డీ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజలకు సంక్షేమ పథకాలను ఎలా అందజేయాలనే అంశాలను వారికి వివరించారు. ఏఈఆర్‌డబ్ల్యూఎస్ సుమలత మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి వ్యవస్థ తదితర అంశాలను వివరించారు. అనంతరం వెలుగు, వైద్యం ఐసీడీఎస్, పీఆర్‌కు సంబంధించిన అంశాలను ఆయా శాఖల అధికారులు వారికి వివరించారు. శిక్షణలో ప్రతి అంశాన్నీ పూర్తిగా తెలుసుకోవాలని సంబంధిత అధికారిణి నాగలక్ష్మి పేర్కొన్నారు.

వీరపునాయునిపల్లెలో...

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం రెండవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సుస్థిరాభివృద్ధి సాధన సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సమన్వయంతోనే సాధ్యమని భావించి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్, ఎంఈఓ జాఫర్ సాదిక్, ఎంఓటి నాగభూషణరెడ్డి, వెలుగు ఏపీఎం భాగ్యమ్మ, ఏపీఓ, ఎన్ఆర్‌జీఎస్ లక్ష్మినారాయణ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, ఏఎన్ఎమ్‌లు, మహిళా పోలీసులు, డిజిటల్, అగ్రికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థను బలపరచడం సామాజిక శాస్త్ర లక్ష్యం



డాక్టర్ శీలం ప్రశాంతి, కేవీకే సామాజిక శాస్త్రవేత్త

నికెదిన్నె, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబ వ్యవస్థను బలపరచి సమాజంలో మంచి మార్పులు తీసుకొచ్చి దేశ అభ్యున్నతికి కృషి విజ్ఞాన కేంద్రం సామాజిక శాస్త్రం ఎంతగానో తోడ్పడుతుందని కృషి విజ్ఞాన కేంద్రం సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ శీలం ప్రశాంతి అన్నారు. ఆ వివరాలు పటాపట్ ఇంటర్వ్యూలో...

పటాపట్

ప్రశ్న: సామాజిక శాస్త్రవేత్తగా మీ లక్ష్యం ఏమిటి?

జవాబు: కుటుంబ వ్యవస్థను ఆర్థికంగా, ఆరోగ్యంగా బలపరచడం, మహిళ, యువతకు సాధికారతకు కృషి చేయడం సామాజిక శాస్త్రవేత్తగా నా ప్రధాన లక్ష్యం. ఈ మేరకు పనిచేస్తున్నా.

ప్రశ్న: నిరుద్యోగ యువత కోసం ఏమి చేస్తున్నారు?

జవాబు: వ్యవసాయ కుటుంబంలో నుంచి వచ్చే నిరుద్యోగ యువతకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. వారికి స్వయం ఉపాధిపై శిక్షణ ఇస్తున్నాం. ఇలా వారి అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

ప్రశ్న: యువత, మహిళలకు ఏయే అంశాలపై శిక్షణ ఇస్తారు?

జవాబు: యువతకు, మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ ఇవ్వడంతో పాటు డీపీఆర్ రాయడంలో కూడా శిక్షణ ఇస్తున్నాం. బ్యాంకుల నుంచి రుణం పొంది అభివృద్ధి వైపు పయనించేందుకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: ఎవరెవరికి శిక్షణ ఇస్తారు?

జవాబు: ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపుపై శిక్షణ ఇస్తాం. ఎస్‌హెచ్‌జీలు, రైతు ఉత్పత్తి సంఘాలు, యువత, గృహిణులకు శిక్షణ ఇస్తాం.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎంత మందికి శిక్షణ ఇచ్చారు?

జవాబు: ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రతి సంవత్సరం వంద మందికి శిక్షణ ఇచ్చి వారు స్వయం ఉపాధి పొందేలా కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకు 1500 మంది మహిళలు, యువత, రైతు ఉత్పాదక సంఘంలో ఎనిమిది మందికి, శిక్షణ ఇచ్చాం.

ప్రశ్న: ప్రస్తుతం ఏయే ఉత్పత్తులు తయారు చేస్తున్నారు?

జవాబు: క్షేత్రస్థాయి పరిశీలనలో యువతకు పచ్చి అరటికాయతో పొడి తయారు చేస్తున్నాం. చిరుధాన్యాలతో పిల్లలు, యువతకు చిరుతిండ్లు తయారు చేస్తున్నాం. అందులో చాక్లెట్లు, న్యూట్రీ బార్, ప్యాపిలి, నిర్జలీకరణతో తయారు చేసిన మామిడి, బొప్పాయి తదితర ఉత్పత్తులు తయారు చేస్తున్నాం.

ప్రశ్న: ప్రథమ శ్రేణి ప్రదర్శన కింద ఏయే ఉత్పత్తులు తయారు చేస్తున్నారు?

జవాబు: ప్రథమ శ్రేణి ప్రదర్శన కింద మునగాకు పొడి, చిరుధాన్యాలతో బిస్కెట్లు, ఎండబెట్టిన పూలలో సాంకేతిక ఉపయోగించి స్వయం ఉపాధి కల్పించడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నాం.

ప్రశ్న: విద్యార్థులకు ఏమైనా సూచనలు, సలహాలు ఇస్తున్నారా?

జవాబు: కస్తూర్బా పాఠశాల, ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు కూరగాయల కిట్లు అందించడంతో పాటు కూరగాయల పెంపకంపై శిక్షణ ఇస్తున్నాం. వారికి అవసరమైన ఆకుకూరలు, కాయగూరలు అక్కడే తయారు చేసే విధంగా అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: ఇవే కాకుండా ఇతర కార్యక్రమాలు ఏమైనా చేపడుతున్నారా?

జవాబు: చదువుల్లో వెనుబడిన పిల్లలకు చైల్డ్ కౌన్సెలింగ్ ఇస్తున్నాం. చదువులో ఉద్వేగాలు, ఒత్తిడికి గురయ్యే విద్యార్థులకు ఒత్తిడిని దూరం చేసేందుకు అవగాహన కల్పించి వారిలో భయాన్ని దూరం చేస్తున్నాం. లర్నింగ్ డిజిబులిటీ (అభ్యసన వైకల్యం) పిల్లలకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి కెరీర్ గైడెన్స్‌ను అందిస్తున్నాం.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

వల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వల్లూరు మండలంలోని చెరువునీటి వినియోగదారుల సంఘాలకు జరిగే ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తహసీల్దార్ శ్రీవాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎన్నికలను నిష్పక్షపాతంగా జరుపుతామని తెలిపారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

చక్రాయపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీటి సంఘాల ఎన్నికలకు గాను ఏడు చెరువులకు నామినేషన్ల పర్వ ముగిసింది. మండలంలోని గొందిచెరువు, చక్రాయిచెరువు, దేశిరెడ్డిచెరువు, రేకులకుంట, పుష్పాలకుంట, గండికొవ్వూరు చెరువుతో పాటు కాలేటివాగు డ్యామ్‌లకు నామినేషన్లు జరిగాయి. వీటికి శనివారం ఎన్నికలు జరుపుతున్నట్లు తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డిలు తెలిపారు.

'చట్టం అందరికీ సమానమేనా' సదస్సును విజయవంతం చేయండి




సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్

కడప మారుతీనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'చట్టం అందరికీ సమానమేనా' అనే అంశంపై ఈనెల 15న కడప హరిత హోటల్‌లో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు జరగనున్నట్లు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక నేరస్థులను అందలమెక్కించడం, హక్కుల కోసం ఉద్యమించే వారిపై ఉక్కుపాదం మోపడం మన దేశంలో పరిపాటిగా మారిందన్నారు. పలుకుబడి కలిగిన రాజకీయ నేరస్థులకు ఊరట కలిగించడం కూడా అలవాటైందన్నారు. కేవలం పాలకులను ప్రశ్నించినందుకు దాదాపు 90 శాతం వికలత్వంతో చక్రాల బండికే పరిమితమైన ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబాను చేయని నేరానికి సుమారు 10 సంవత్సరాలు జైలులో ఉంచడం దారుణమన్నారు. మరణశయ్యపై ఉన్న ఆయన తల్లిని చివరి చూపు చూసేందుకు కూడా నిరాకరించడం పాలకుల రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో చట్టం, న్యాయం, అమలవుతున్న తీరు బాధాకరంగా ఉందన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరు గురించి అభ్యుదయవాది ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కావున ప్రజాస్వామికవాదులు, మేధావులు, విద్యార్థులు తప్పక హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు గాలి చంద్ర, నాగసుబ్బారెడ్డి, సీపీఎం నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాసులురెడ్డి, ఆర్పీపీ నాయకులు రవిశంకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

సింహాద్రిపురం, డిసెంబరు 13: సింహాద్రిపురం శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం లో శుక్రవారం ప్రత్యేక పూజలతో పాటు, హోమం నిర్వహించారు. గ్రామోత్సవానికి వినియోగించేందుకు నూతన రథం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉదయాన్నే స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తరశతనామావళి, గణపతి, నారాయణ, నవగ్రహ, వాస్తు హోమ పూజలు ఆలయ ప్రధాన అర్చకులు హరి ప్రసాద్‌శర్మ, వేద పండితులు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

'కదిరి సీఐ నారాయణరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి'



పులివెందులలో నిరసన తెలుపుతున్న లాయర్లు

పులివెందుల టౌన్, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): కదిరి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ నారాయణరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పులివెందుల లాయర్లు నరసింహారెడ్డి, కిషోర్‌కుమార్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గజేంద్రనాథ రెడ్డి, తులసిరాములు, మరి కొంత మంది శుక్రవారం కోర్టు వద్ద విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం డీఎస్పీ మురళీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 12వ తేదీ లాయర్ గజేంద్ర క్లైంట్‌కు నోటీసు పంపించాడన్నారు. నోటీసు ఫోర్జరీ చేశాడని సీఐ నారాయణరెడ్డి లాయర్‌కు ఫోన్ చేసి చెప్పారన్నారు. ఫోర్జరీ విషయం నాకు తెలియదని లాయర్ గజేంద్ర సీఐకి చెప్పాడన్నారు. దీంతో సీఐ నారాయణరెడ్డి లాయర్ గజేంద్రపై కేసు నమోదు చేస్తున్నానని బెదిరించాడన్నారు. నాకు తెలిసిన వ్యక్తికి నోటీసు పంపుతావా, నీ అంతు చూస్తా.. నీపై థర్డ్ డిగ్రీ ఉపయోగిస్తానని బెదిరించారని వారు తెలిపారు. ఈ విషయంపై పులివెందుల డీఎస్పీ మురళీని కలిసి కదిరి సీఐ నారాయణరెడ్డి, మరో వ్యక్తి రామకృష్ణపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి వినతి పత్రం అందజేశారు.

నాగబాబును కలిసిన తుంగా రమణయ్య

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 13: హైదరాబాద్‌లో ప్రముఖ సినీ నటుడు నాగబాబును శుక్రవారం కడప జనసేన నాయకుడు తుంగా రమణయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. నాగబాబును క్యాబినెట్‌లోకి తీసుకుంటానని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన నేపథ్యంలో ఆయనకు తుంగా రమణయ్య శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని పదవులు అలంకరించి నిరుపేదలకు సాయం అందించాలని ఆకాంక్షించారు. అలాగే కడప నగర విషయాలను ఆయన నాగబాబుకు వివరించారు.



సినీ నటుడు నాగబాబుతో తుంగా రమణయ్య

ట్రాఫిక్ అస్తవ్యస్తం..!

- రోడ్లపైనే ఇష్టానుసారంగా వాహనాలు
- పట్టించుకోని పోలీసులు



రోడ్డుపైన అన్‌లోడ్ చేస్తున్న లారీ

ఖాజీపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు ఆపడం, మాటా మాట కలిపి మాట్లాడడం, యువకులు అయితే వారికి నచ్చిన విధంగా డ్రైవింగ్ చేయడం, ఆటోలు ఇష్టానుసారంగా ఆపివేయడం, దుకాణాదారులు అయితే ఇంటి ముందు ప్రభుత్వ స్థలంలో కూడా అంగళ్లు పెట్టుకోమని వారి వద్ద నుంచి వేలకు వేలు వసూలు చేస్తూ ఇటు పంచాయతీకి కూడా నిధులు రాకుండా వారు ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కడప-కర్నూలు జాతీయ రహదారిలోని ఖాజీపేట బస్టాండు కూడలిలో దుకాణాలు ఉన్నాయి. అయితే వారి స్థలం వరకు గృహాలు నిర్మించుకున్నారు. దుకాణాలకు వెళ్లేవారు రోడ్డు పక్కన వాహనాలు ఆపి సరుకులు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలుగజేసుకుని ట్రాఫిక్‌ను నియంత్రించకుంటే పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- **రోడ్లపైనే వాహనాలు..:** జాతీయ రహదారిపైన, పోలీసు స్టేషన్‌కు వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బదులు ఎదుర్కొంటున్నారు. రోజు రోజుకు పెరిగిపోతున్న పండ్లు, కూరగాయల వాహనాలు రోడ్లపై ఆపి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దానికితోడు స్కూటర్లు, చిన్న ఆటోలు రోడ్లపై ఆపడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- **రోడ్డుపైనే అన్‌లోడింగ్..:** ట్రాఫిక్ లేని సమయంలో భారీ వాహనాలు అన్‌లోడ్ చేయాల్సి ఉండగా దుకాణాదారులు వారికి నచ్చిన సమయంలో దించుతూ వాహనదారులకు ఇబ్బంది పెడుతున్నా పోలీసులకు చీమకుట్టినట్లుగా లేదన్న విమర్శలు వస్తున్నాయి. అంతేకాక బస్సులు నిర్ణీత స్టేజీలో ఆపాలన్నా ఆటోలు, స్కూటర్లు, లారీలు అడ్డం ఉండడంతో మరోచోట ప్రయాణికులను దింపుతున్నారు.
- **బస్టాండులో ఈవ్‌టీజింగ్..:** బస్టాండు కూడలిలో నిలుపుకున్న ఆటోలు సెల్‌ఫోన్‌లో గేములు ఆడడంతోపాటు దారిన వెళ్లే మహిళలను కామెంట్ చేస్తూ అడ్డూఅదుపు లేకుండా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఆటో డ్రైవర్లు ఘర్షణ పడినప్పుడు అయితే వినరాని మాటలు మాట్లాడుతూ ఇటు పాదచారులకు, అటు ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.
- ట్రాఫిక్‌పై సీఐ మోహన్‌ను వివరణ కోరగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగజేస్తే కఠిన చర్యలు ఉంటాయని, బస్టాండు కూడలిలో, పోలీసు స్టేషన్ వద్ద ట్రాఫిక్ వరకు సిబ్బందిని ఏర్పాటుచేస్తామని అన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం


ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ డీఈ శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 33వ కేవీ ఫీడర్లు, వివిధ ప్రాంతాల్లో ఉన్న 11 కేవీ ఫీడర్ల పరిధిలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణకోసం విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కోర్టు ఫీడర్‌కు ఎటువంటి అంతరాయం ఉండదని తెలిపారు.

కొండాపురం..: మండలంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ రామకృష్ణ తెలిపారు. ఈ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 8 నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ ,కంప చెట్ల తొలగింపు తదితర పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగు తుందని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

16 నుంచి ధనుర్మాస పూజలు



ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాత మార్కెట్‌లోని లలితాదేవి రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో 16వ తేదీ నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5.30 గంటలకు తిరుప్పావై పాశురాల పఠనం, తెలుగు పండితులు మద్దిలేటయ్య ఆధ్వర్యంలో పురాణ పఠనం ఉంటుందని పేర్కొన్నారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, 11వ తేదీ ఉదయం నగర సంకీర్తన, 108 మట్టి కుండలలో శ్రీకృష్ణునికి పాయసాన్నం నివేదన ఉంటుందన్నారు. 13వ తేదీ ఉదయం గోదాదేవి, శ్రీకృష్ణుల కల్యాణం, రాత్రికి పాన్పుల సేవ నిర్వహిస్తామని, భక్తులు స్వామివారి కల్యాణంలో పాల్గొనాలని కోరారు.



లైసెన్స్ ఉన్న వారే వాహనాలను నడపండి

జమ్మలమడుగు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు సబ్‌డివిజన్ పరిధిలో ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు, లైసెన్స్ ఉన్న వారు నడపాలని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు పోలీసు స్టేషన్‌లో వాహనదారులకు కౌన్సెలింగ్ చేశారు. సీఐ లింగప్ప, ఎస్ఐలు రామకృష్ణ, కల్పన, వారి సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగులో 144 సెక్షన్ : ఆర్డీవో

జమ్మలమడుగు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ కఠినంగా అమలు చేయాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు జమ్మలడుగు అర్బన్ పోలీసులు తెలిపారు. ప్రస్తుతం సాగునీటి ఎన్నికలు జరుగుతుండడం, ఇప్పటికే పలు ప్రాంతాల్లో జరిగిన ఘటనలకు సంబంధించి 144 సెక్షన్ అమలులోకి వచ్చింది.

'బీజేపీని బలోపేతం చేయాలి'

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బూత్‌స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ పేర్కొన్నారు. శుక్రవారం గీతాశ్రమంలో క్రియాశీల సభ్యత్వాలు, బూత్ కమిటీల నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సభ్యత్వ ప్రముఖ్ శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బీరం సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు కోనేటి క్రిష్ణ ప్రదీప్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి హరినారాయణ, అసెంబ్లీ కోకన్వీనర్ గౌరీశంకర్, పట్టణాధ్యక్షుడు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోపు సమస్యలకు పరిష్కారం

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులలో స్వీకరించే ప్రతి భూ సమస్యకు నిర్ణీత గడువులోపు పరిష్కారం లభిస్తుందని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గోపవరంలో ఉన్న గ్రామ సచివాలయంలో తహసీల్దారు గంగయ్య అధ్యక్షతన రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు గంగయ్య, గ్రామ సర్పంచ్ గడ్డా మోష, టీడీపీ నాయకులు గజ్జెల పుల్లయ్య, లక్ష్మణ్, రఫి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనకు తరలిరావాలి

పోరుమామిళ్ల, డిసెంబరు 13 : ఈ నెల 15న జరగబోయే మాలల మహా సింహ గర్జనకు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ తరలి రావాలని అంబేడ్కర్‌సేన రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి ముత్యాలప్రసాద్‌రావు తెలిపారు. జేఏసీ ఆధ్వర్యంలో గుంటూరులోని హౌసిం గ్‌బోర్డుకాలనీలో సీతారాంటౌన్‌షిప్ ఎదురు గా ఈ బహిరంగసభ ఉంటుందన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

బద్వేలుటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నెల్లూరురోడ్డులో గురువారం రాత్రి కారు డివైడర్‌ను ఢీ కొనడంతో ప్రమాదం తృటిలో తప్పింది. నాలుగురోడ్ల కూడలి నుంచి నెల్లూరురోడ్డువైపు వెళుతున్న కారు శ్రీనివాస హాస్పిటల్ ఎదురుగా మద్యం మత్తులో కొందరు యువకులు ద్విచక్రవాహనంలో డ్రైవ్‌కొడుతుండగా ఆ ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి డివైడర్‌ను ఢీ కొనడంతో కారు బోల్తా కొట్టింది. స్థానికులు కారులో ఉన్న వ్యక్తిని బయటకుతీసి ట్రాఫిక్‌కు అంతరాయంలేకుండా పక్కకు తొలగించారు.

ప్రధాన కాలువలపై ఆక్రమణలను తొలగించాలి



మాట్లాడుతున్న వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఎమ్మెల్యే నంద్యాలవరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఎమ్మెల్యే పట్టణాభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదూరు, కొత్తపల్లె కాలువ, ప్రొద్దుటూరు చానెల్ -1, ప్రొద్దుటూరు చానెల్-2, దొరసానిపల్లె చానెల్‌పై ఆక్రమణలు వెలిశాయని, తొలగించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బొల్లవరంలోని మున్సిపల్ లేఅవుట్లను అభివృద్ధి చేసి ప్లాట్లను వేలంపాట ద్వారా అమ్మడానికి త్వరగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో ఉన్న అయిదు ప్రధాన మురికి కాలువల ప్రాజెక్టు రిపోర్టును భవిష్యత్తులో కార్పొరేషన్ అవసరాలకు అనుగుణంగా తయారు చేయాలని, కన్సల్టెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. రోడ్ల విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉందని, మురుగు కాలువలను ఆధునికీకరించడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దువ్వూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం గుడిపాడు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లోకేసు, సుందరం అనే ఇద్దరికి గాయాలయ్యాయి. రోడ్డుమీద స్కూటర్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులను వెనుకవైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ప్రణీత్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూలుకు చెందిన 8వ తరగతి వై.ప్రణీత్‌రెడ్డి రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 30వ తేదీ విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో పాల్గొంటారు. ఆ విద్యార్థి రాష్ట్రస్థాయి కౌశల్ క్విజ్ పోటీలకు ఎంపిక కావడంపట్ల ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల జోరు



జమ్మలమడుగు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెన్నానదిలో ఇసుక పోయి గుంతలు, గులకరాళ్లు దర్శనమిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వవ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకురావడంతో అక్రమ రవాణా చేసే వారికి అడ్డూ అదుపు లేకుండాపోయింది. ఏ గ్రామంలో చూసినా జోరుగా ఇసుక తరలిపోతోంది. జమ్మలమడుగు, మైలవరం మండలాల్లోని పెన్నానది పరిసర ప్రాంతాలు ఇసుక ఖాళీ అవుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లోని వీధుల్లో ఇసుక ట్రాక్టర్ల జోరు డబుల్ లోడుతో ఇసుక తరలిపోతోంది. అధికారులు ఇసుక కట్టడి చేయాలని లేనిచో ప్రజలకు భవిష్యత్తులో మంచినీరు కూడా లేకుండా పోతాయని వాపోతున్నారు. ఇసుక ఇసుక విధానం పేరుతో అన్ని గ్రామాలు, పట్టణాల్లో ఇసుకాసురులు అవసరం లేకున్నా అనేక చోట్ల ఇసుక స్టాక్ పెడుతున్నారని వాటిని గుర్తించి కేసులు నమోదు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలో నిర్వహించే సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. శుక్రవారం తహసీల్దారు గంగయ్య, మైలవరం కాలువ ఏఈ లలితారెడ్డి, కేసీ కెనాల్ ఏఈ గురుమోహన్‌రెడ్డిలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లపై సమీక్షించారు. శనివారం ప్రొద్దుటూరు మండల పరిధిలో నాలుగు నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. మైలవరం ఆయకట్టు కింద పెద్దశెట్టిపల్లె, బొల్లవరం, ప్రొద్దుటూరు నీటి సంఘాలు, కేసీ ఆయకట్టు కింద ఉప్పరపల్లె నీటి సంఘాల ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి గొడవలు తావులేకుండా ప్రశాంత ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టామని తహసీల్దారు గంగయ్య తెలిపారు.

చాపాడు..: ఈనెల 14న శనివారం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చాపాడు చానల్ ఏఈ గురుమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో మొత్తం ఏడుసాగునీటి సంఘాలు ఉన్నాయి. రైతులు ఈ సంఘాలకు 12 మంది సభ్యులను ప్రెసిడెంట్, వైస్‌ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. 63, 67 నంబర్లుగల మదూరు, 64వ నెంబర్ చియ్యపాడు, 69, 70 నంబర్లుగల అనంతపురం, 71వ నంబరు సోమాపురం, 74వ నంబరు అల్లాడుపల్లె సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం 10 గంటలలోపు పోటీ చేసేవారు నామినేషన్ వేయాల్సి ఉంటుందన్నారు. మధ్యాహ్నంలోపు ఎన్నికలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

పోరుమామిళ్ల..: నేడు మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించి సంచర్ల, రామిరెడ్డికుంట, బుచ్చంపల్లె, కొర్రపాటిపల్లె, ఆమడకుంట, సిద్దవరం, చల్లగిరిగెల, ఎల్లోపల్లె, ఎస్.వెంకటరామాపురం, నాగులచెరువు, తెలుగుగంగ పరిధిలో పోరుమామిళ్ల, రంగసముద్రం, దమ్మనపల్లె ఆయుకట్టుకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయి. పోరుమామిళ్ల, రంగసముద్రం, దమ్మనపల్లెలో 12టీసీలు ఉండగా, మిగిలిన 10కి సంబంధించి ఒక్కొక్కటి 6టీసీలు ఉన్నాయి. శనివారం వీటికి ఎన్నికలు జరగనున్నాయి.

కొండాపురం..: మండలంలోని వెంకయ్య కాలువ, చెన్నమనేనిపల్లె, లింగమనేనిపల్లె గ్రామాలకు సంబంధించిన రైతులు అనంతపురం జిల్లా యల్లనూరులో తమ ఓటును ఉపయోగించనున్నారు. ఈ గ్రామాలకు సంబంధించి ఆయకట్టు అనంతపురం జిల్లా యల్లనూరు మండలంలోని కాలువల క్రింద సాగు ఉండటంతో ఆ మండలం గెజిట్‌లోకి చేర్చారని తహసీల్దార్ గురప్ప తెలిపారు. దీంతో మండలంలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు లేవని ఆయన తెలిపారు. ఈ గ్రామాలు యల్లనూరు మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల పరిధిలోనే ఉంటాయి. కొండాపురానికి 15 కిలోమీటర్ల పరిధిలో వస్తాయి.పలు ప్రాంతాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్న సంగతి తెలిసిందే.